పత్రికా స్వేచ్ఛ ప్రజాస్వామ్యంలో అంతర్భాగం

● రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, ప్రొఫెసర్లు, కవులు

రామగిరి, నవంబర్ 16 : పత్రికా స్వేచ్ఛ ప్రజాస్వామ్యంలో అంతర్భాగమని రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో రూపొందించిన 'నల్లగొండ జిల్లా సమగ్ర స్వరూపం' పుస్తకాన్ని ఆవిష్కరణ కార్యక్రమం శనివారం నల్లగొండలోని ఎన్‌జీ కళాశాల సమావేశ మందిరంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా సమగ్ర స్వరూపం పుస్తకం రూపొందించడం శుభపరిణామమన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎల్లూరి శివారెడ్డి మాట్లాడుతూ 33 జిల్లాల సమగ్ర స్వరూపం నేటి తరానికి అందించాలనే సంకల్పంతోనే పుస్తకాన్ని రూపొందించినట్లు తెలిపారు. చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ వీసీ సూర్య ధనుంజయ్, ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ అధ్యక్షుడు సాగి కమలాకర శర్మ, సారస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి జూర్రు చెన్నయ్య, సాహితీ వేత్తలు శ్రీరంగాచార్య మాట్లాడారు. కార్యక్రమంలో సమాచార శాఖ సంయుక్త సంచాలకుడు కన్నెకంటి వెంకటరమణ, గ్రంథ రచనా కోర్ కమిటీ సభ్యులు భిన్నూరి మనోహరి, కవులు, రచయితలు బండారు సుజాతాశేఖర్, తండు కృష్ణకౌండిన్య, సాగర్ల సత్తయ్య, పున్న అంజయ్య, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, మునాస్ వెంకట్, ఎన్‌జీ కళాశాల ప్రిన్సిపాల్ సముద్రాల ఉపేందర్, అధ్యాపకులు వెల్దండి శ్రీధర్, లవేందర్ రెడ్డి, ఆనంద్, గోవర్ధనగిరి, మామిడి లింగస్వామి, ఎన్.సైదులు, విద్యార్థులు, సాహితీ వేత్తలు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలివ్వాలని వినతి

నీలగిరి : ప్రెస్ అకాడమి చైర్మన్ శ్రీనివాస్ రెడ్డిని ప్రెస్‌క్లబ్ నల్లగొండ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందించారు. అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ నల్లగొండ జిల్లా కేంద్రంలోని అర్హులందరికీ త్వరలో ఇంటి స్థలంతో పాటు ఇల్లు నిర్మించి ఇస్తామన్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎర్రెడ్ల చంద్రశేఖర్‌రెడ్డి, వంగాల శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి గుండాల యాదగిరి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

● ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు, నవంబర్16 : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు, అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆదేశించారు. డీఈఓ భిక్షపతితో పాటు నియోజవర్గంలోని అన్ని మండలాల ఎంఈఓలు, విద్యాశాఖ అధికారులతో మండల కేంద్రంలోని తన క్యాంప్ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. నియాజకవర్గంలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ఓకే కాంపౌండ్‌లో ఉండేలా ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేస్తామన్నారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈఓలు, కాంప్లెక్స్‌ల హెచ్ఎంలు పాల్గొన్నారు.

నిలిచిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలి

● ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

అసంపూర్తిగా ఉన్న కాల్వను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

మిర్యాలగూడ, నవంబర్ 16: పట్టణంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను అధికారులు సత్వరమే పూర్తి చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సూచించారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్, పబ్లిక్, నేషనల్ హైవే అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పర్చాలని, రోడ్ల విస్తరణ, ప్రధాన రహదారులకు మరమ్మతు పనులు, లైటింగ్ ఏర్పాటు పనులు ప్రారంభించాలన్నారు. అనంతరం అధికారులతో కలిసి పలు కాలనీలను సందర్శించారు. ఆయన వెంట ఆయా శాఖల అధికారులు, నాయకులు ఉన్నారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

● జిల్లా వ్యవసాయ అధికారి పాల్వాయి ప్రేమ్‌కుమార్

ధాన్యాన్ని పరిశీలిస్తున్న ప్రేమ్‌కుమార్

కొండమల్లేపల్లి, నవంబర్ 16 : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లను పారదర్శకంగా చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి పాల్వాయి ప్రేమ్‌కుమార్ ఆదేశించారు. శనివారం మండంలోని పెండ్లిపాకల గ్రామ సమీపంలోని బాబ్లతండాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. తేమ శాతం 17లోపు ఉండేలా ధాన్యాన్ని ఆరబెట్టి తీసుకు రావాలని సూచించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి వై.జానకిరాములు, ఏఈఓలు బి.మల్లేశ్, ఎన్.సురేశ్, వి.మాధురి, సీఈఓ తిరుపతిరెడ్డి ఉన్నారు.

చెరువులో పడి వ్యక్తి గల్లంతు

దామరచర్ల, నవంబర్ 16: చేపల వేట కోసం చెరువులోకి వెళ్లిన మండలంలోని బొత్తలపాలెం గ్రామానికి చెందిన జింకల తిరుపతయ్య(60) శనివారం నీట మునిగి గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతయ్య బొత్తలపాలెం గ్రామ శివారులోని ఊరచెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. వల విసిరే క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయాడు. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు చెరువు వద్దకు వెళ్లి పరిశీలించగా ఒడ్డున చెప్పులు, కర్ర కనిపించాయి. చెరువులో గాలించినా ఆచూకీ లభించలేదు. సాగర్ మేజర్ కాల్వ నుంచి చెరువులోకి నీటి విడుదలను నిలుపుదల చేస్తున్నట్లు డీఈ జనార్దన్ తెలిపారు. నీటి ప్రవాహం తగ్గిన వెంటనే గాలింపు చర్యలు చేపడతామని ఎస్ఐ హరి కృష్ణ తెలిపారు.

25 వరకు పైలట్ ప్రాజెక్టు సర్వే పూర్తి చేయాలి

● కలెక్టర్ ఇలా త్రిపాఠి

సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

తిరుమలగిరి(సాగర్), నవంబర్ 16 : పైలెట్ ప్రాజెక్టుగా మండలంలో చేపడుతున్న భూముల సర్వేను ఈ నెల 25లోపు పూర్తి చేయాలని, ధరణి సమస్యలపై రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయంలో వివిధ మండలాలకు చెందిన అధికారులతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. సర్వేపై అధికారులు చెప్పే సమాధానాలపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సర్వేలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పైలట్ ప్రాజెక్టును వేగవంతంగా పూర్తి చేయాలని తాసీల్దార్‌ను కోరారు. తునికినూతల రైతులు కలెక్టర్‌ను కలిసి తమకు పాస్ పుస్తకాలు అందలేదని వినతిపత్రం అందించగా ఆమె గ్రామానికి వెళ్లి సర్వే నం.45లో ఉన్న అటవీ, ప్రభుత్వ భూములను పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నెల్లికల్, కోనేటిపురం, తిరుమలగిరి(సాగర్) రైతులు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. వారి సమస్యలు పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అనంతరం మండలంలోని తునికి నూతల గ్రామంలో సర్వేను పర్యవేక్షించారు. ఆమె వెంట సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుబ్రహ్మణ్యం, ఏడీ శ్రీనివాస్, తాసీల్దార్లు శ్రీనివాస్, అనిల్, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

జిల్లాలో లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

నల్లగొండ : జిల్లాలో ఇప్పటి వరకు దొడ్డు ధాన్యం లక్ష మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్లు, రూ.109కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. సన్న ధాన్యం 4,900 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్ల సందర్భంగా రైతులకు ఇబ్బంది కలుగకుండా ఉండటానికి తనతో పాటు అదనపు కలెక్టర్, సివిల్ సప్లై అధికారులు, ప్రత్యేకాధికారి పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సైతం కేంద్రాలకు వచ్చిన ధాన్యం త్వరగా కొనే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కళలకు జీవం పోసే బాధ్యత అందరిపై ఉంది

● నర్రా ఫౌండేషన్ చైర్మన్ ప్రవీణ్‌రెడ్డి

కార్యక్రమంలో మాట్లాడుతున్న నర్రా ప్రవీణ్‌రెడ్డి

నార్కట్‌పల్లి, నవంబర్ 16 : కళలకు జీవం పోయాల్సిన బాధ్యత కళాకారులతో పాటు మనందరిపై ఉందని తెలుగు పరిశోధక మండలి, నర్రా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ నర్రా ప్రవీణ్‌రెడ్డి అన్నారు. విజయభారతి నాట్యమండలి ఆధ్వర్యంలో పట్టణంలో మూడు రోజుల పాటు నిర్వహించిన సురభి నాటక స్వర్ణోత్సవ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ముగింపు వేడుకల్లో ఆయన పాల్గొని కళాకారులను ఘనంగా సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ దశాబ్దాల క్రితం కడపలోని సురభి ప్రాంతంలో ఆవిర్భవించిన నాటక సమాజాన్ని నేటికీ సజీవంగా ఉంచిన కళాకారులను అభినందించారు. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళాకారులకు చేయూతనందిస్తామన్నారు. కార్యక్రమంలో విజయ భారతి నాట్య మండలి అధ్యక్షుడు లేఖజ్, కార్యదర్శి వి.ఉపేందర్, అనంతుడు ఫౌండేషన్ చైర్మన్ మోత్కూరు శ్రీనివాస్, నర్రా ఫౌండేషన్ కార్యదర్శి నర్రా వేణుగోపాల్ రెడ్డి, రాంరెడ్డి, రిటైర్డ్ టీచర్ పుష్పగిరి పాల్గొన్నారు.

గౌడ సంఘం జిల్లా కార్యదర్శిగా యాదయ్యగౌడ్

నియామకపత్రం అందుకుంటున్న యాదయ్యగౌడ్

శాలిగౌరారం, నవంబర్ 16 : కౌండిన్య గౌడ సంఘం జిల్లా కార్యదర్శిగా మండలంలోని బైరవునిబండ గ్రామానికి చెందిన ఈదులకంటి యాదయ్యగౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కేఎల్ఎన్ ప్రసాద్ శనివారం నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా యాదయ్యగౌడ్ మాట్లాడుతూ సంఘం బలోపేతం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు ప్రొజెక్టర్ అందజేత


ప్రొజెక్టర్ అందిస్తున్న కస్తూరి ఫౌండేషన్ సభ్యులు

చండూరు,నవంబర్ 16: మండలంలోని బంగారిగడ్డ మండల పరిషత్ పాఠశాలకు కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ శ్రీచరణ్ సహకారంతో రూ.20వేల విలువైన ప్రొజెక్టర్‌ను అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యుడు పిన్నింటి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలల బలోపేతమే కస్తూరి ఫౌండేషన్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ సుధాకర్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాదగోని వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ పల్లె వెంకన్న, జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం ఎండ్ల భిక్షం పాల్గొన్నారు.

గ్రూప్ -3 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు : సబ్ కలెక్టర్

మిర్యాలగూడ, నవంబర్ 16: ఈ నెల 17,18 తేదీల్లో జరిగే గ్రూప్-3 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ తెలిపారు. శనివారం పలు పరీక్ష కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. పట్టణంలో, మండలంలో మొత్తం 28 కేంద్రాలను ఏర్పాటు చేశామని, 420 ఇన్విజిలేటర్లను నియమించామని తెలిపారు. ప్రతి కేంద్రంలో అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు

గ్రూప్-3 పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపారు. శనివారం వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పోలీసు సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు రోజులపాటు పరీక్షలు సజావుగా సాగేందుకు నలుగురు సీఐలు, 15 మంది ఎస్ఐలు, 130 మంది పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు నిర్వహించనున్నట్లు తెలిపారు.

అన్ని కులాల అభ్యున్నతికి కృషి

రామగిరి, నవంబర్ 16: రాష్ట్రంలోని అన్ని కులాల అభ్యున్నతికి ధర్మ సమాజ్ పార్టీ కృషి చేస్తుందని పార్టీ జిల్లా కోకన్వీనర్ శంకర్ తెలిపారు. శనివారం నల్లగొండలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదు డిమాండ్లతో పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 18న జిల్లా కలెక్టర్‌కు, 19, 20 తేదీల్లో అన్ని మండలాల్లో తాసీల్దార్లకు వినతి పత్రాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు గిరి, మహేశ్వరాచారి, వినోద్ , నల్లగొండ మండల కన్వీనర్ సైదులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వృద్ధురాలు మృతి

శాలిగౌరారం, నవంబర్ 16 : బైక్ ఢీకొని మండలంలోని వల్లాల గ్రామానికి చెందిన కొయ్యగూరి కోటమ్మ(70) శుక్రవారం సాయంత్రం మృతి చెందింది. ఎస్ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. కోటమ్మ తన ఇంటి ముందు ఉన్న చెట్టు కింద కూర్చొని ఉండగా టీవీఎస్ వాహనంపై నకిరేకల్ నుంచి శాలిగౌరారం వైపు వస్తున్న వంటిపాక భాస్కర్ అదుపుతప్పి కోటమ్మను ఢీకొట్టాడు. దాంతో ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో నల్లగొండలోని ప్రైవేటు దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

శాలిగౌరారం, నవంబర్ 16 : అక్రమంగా నిల్వ ఉంచిన 26 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శనివారం సీజ్ చేసినట్లు ఎస్ఐ సైదులు తెలిపారు. మండలంలోని మాదారం కలాన్ గ్రామానికి చెందిన జక్కుల చంటి గ్రామంలో కార్డుదారుల నుంచి బియ్యాన్ని కొనుగోలు చేసి తన ఇంట్లో నిల్వ ఉంచాడు. దాంతో బియ్యాన్ని స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. చంటిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యవసాయ బావిలో గుర్తు తెలియని మృతదేహం

నిడమనూరు, నవంబర్ 16 : మండలంలోని బంకాపురం గ్రామానికి చెందిన రైతు యలవర్తి వీరభద్రరావు వ్యవసాయ బావిలో శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రైతు వ్యవసాయ బావి వద్ద నుంచి గడ్డి తెచ్చేందుకు ఆయన పాలేరు నాగయ్య వెళ్లాడు. బావిలోకి చూడగా గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కనిపించింది. రైతు వీరభద్రరావు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ గోపాల్‌రావు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని వెలికి తీయించారు. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ప్రభుత్వ ఏరియా దవాఖానకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు, రేపు ఎన్‌జీ కళాశాలలో వాకింగ్‌కు అనుమతి లేదు

నీలగిరి, నవంబర్ 16 : నల్లగొండ పట్టణంలోని నాగార్జున డిగ్రీ కళాశాల మైదానంలో ఈ నెల 17,18 తేదీల్లో వాకింగ్‌కు అనుమతి లేదని టూటౌన్ ఎస్ఐ రావుల నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్జీ కళాశాలలో గ్రూప్-3 పరీక్షలు జరుగనున్నందున రెండు రోజులు ఉదయం వాకింగ్‌కి అనుమతి లేదని పేర్కొన్నారు. వాకర్స్ పోలీసులకు సహకరించాలని కోరారు.

గ్రంథాలయానికి స్టడీ చైర్స్ అందచేత

మిర్యాలగూడ, నవంబర్ 16: ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాతృమూర్తి వెంకట్రావమ్మ జ్ఞాపకార్థం బీఎల్ఆర్ బ్రదర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని గ్రంథాలయానికి స్టడీ చైర్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు బత్తుల సాయిప్రసన్నకుమార్‌రెడ్డి, గ్రంథాలయ నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒక గేటు ద్వారా మూసీ నీటి విడుదల

కేతేపల్లి, నవంబర్ 16 : మూసీకి ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతుండడంతో ప్రాజెక్టు అధికారులు శనివారం ఒక క్రస్ట్‌గేటు ద్వారా నీటి విడుదలను కొనసాగిస్తున్నారు. ఎగువ నుంచి 332 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అధికారులు ప్రాజెక్టు 3వ నంబరు క్రస్ట్ గేటును అర అడుగు మేర ఎత్తి 332 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 645 అడుగులు(4.46 టీఎంసీలు)కాగా ప్రస్తుతం 644.60(4.36 టీఎంసీలు) అడుగులు ఉన్నట్లు ప్రాజెక్టు ఏఈ మధు తెలిపారు.

యూటీఎఫ్ పట్టణ కార్యవర్గం ఎన్నిక

మిర్యాలగూడ, నవంబర్ 16: టీఎస్ యూటీఎఫ్ పట్టణ కార్యవర్గాన్ని శనివారం స్థానిక సంఘం భవనంలో నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నారు. సంఘం మిర్యాలగూడ పట్టణ అధ్యక్షుడిగా కోడిరెక్క జయరాజు, ప్రధాన కార్యదర్శిగా ఎండీ.సాజిద్‌అలీ ఎన్నికయ్యారు. పరిశీలకులుగా సంఘం రాష్ట్ర మహిళా కార్యదర్శి నాగమణి, వ్యవహరించారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, నాయకులు బక్కా శ్రీనివాసచారి, శ్రీనివాస్‌రెడ్డి, చినవెంకన్న, దయాకర్ రెడ్డి, విజయలక్ష్మి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి : డీసీఓ పత్యానాయక్

మునుగోడు, నవంబర్ 16 : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని జిల్లా సహకార అధికారి పత్యానాయక్ ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార కార్యాలయం ఆవరణలో నిర్మిస్తున్న భవనాన్ని పరిశీలించారు. ఆయన వెంట మానిటరింగ్ అధికారి రమేశ్, సీఈఓ సుఖేందర్, పురుశోత్తం పాల్గొన్నారు

సెల్‌టవర్‌కు అనుమతివ్వొద్దని వినతి

హాలియా, నవంబర్ 16 : హాలియా ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న లాడ్జిపై సెల్‌టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని కోరుతూ స్థానిక ప్రజలు శనివారం మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డికి వినతిపత్రం అందించారు. సెల్‌టవర్ నిర్మాణం వల్ల చుట్టుపక్కల ఉండే ప్రజలు రేడియేషన్ వల్ల అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో ఆవుల వెంకటయ్య, అవుతా సైదులు, వెంకన్న, రామ్మూర్తి పాల్గొన్నారు.

బీసీ కులాల జేఏసీ కన్వీనర్‌గా నాగేశ్వరరావు

మిర్యాలగూడటౌన్, నవంబర్16: బీసీ కుల సంఘాల జేఏసీ మిర్యాలగూడ కన్వీనర్‌గా పట్టణానికి చెందిన గుండెబోయిన నాగేశ్వరరావు యాదవ్‌ను నియమించారు. జేఏసీ రాష్ట్ర చైర్మన్ గణేశ్‌చారి శనివారం ఆయనకు నియామకపత్రం అందించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

గుర్రంపోడు, నవంబర్ 16: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కొండాపురం గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ పసుపులేటి మధు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తేనెపల్లి గ్రామానికి చెందిన బొడ్డుపల్లి కృష్ణయ్య (40) మతి స్థిమితం లేకుండా గ్రామాలు తిరుగుతుంటాడు. శుక్రవారం రాత్రి కొండాపురం గ్రామంలో రోడ్డుపై తిరుగుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి వివాహం కాలేదు. మృతుడి అన్న బుచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిడమనూరు, నవంబర్ 16 : మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ తీగలను ఆనుకుంటున్న చెట్ల కొమ్మలను తొలగించే పనులు చేపడుతున్నందున ఆదివారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ పి.జానయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిడమనూరు, నర్సింహులగూడెం, శాఖాపురం గ్రామాల పరిధిలో విద్యుత సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డిని కలిసిన బీఆర్ఎస్ నాయకులు

మాజీ మంత్రిని సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నాంపల్లి, నవంబర్ 16 : మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంతకండ్ల జగదీశ్‌రెడ్డిని మండల బీఆర్ఎస్ నాయకులు శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించారు. మాజీ మంత్రిని కలిసిన వారిలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గుమ్మడపు నర్సింహారావు, మండల అధికార ప్రతినిధి పొగుల వెంకట్‌రెడ్డి, మాల్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కడారి శ్రీశైలం యాదవ్, సుంకిశాల మాజీ సర్పంచ్ రాములు ఉన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం స్ఫూర్తిదాయకం

● ఎమ్మెల్యే బాలూనాయక్

విగ్రహాన్ని ఆవిష్కరించి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే

చందంపేట(దేవరకొండ), నవంబర్ 16 : తెలంగాణ పోరాట యోధుడు, మాజీ మంత్రి కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం స్ఫూర్తిదాయకమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ అన్నారు. శనివారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో దేవరకొండ బస్టాండు వద్ద ఏర్పాటు చేసిన లక్ష్మణ్ బాపూజీ కాంస్య విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, సంఘం నాయకులు స్వామి, యాదగిరి, శిరందాసు కృష్ణయ్య, పగిడిమర్రి రఘురాములు, పులిజాల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ పున్న వెంకటేశ్వర్లు, వెంకటయ్యగౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ

పూజలో పాల్గొన్న ఎమ్మెల్యేలు జయవీర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి

పెద్దవూర, నవంబర్